క్లుప్తంగా

రీజినల్ డైరెక్టర్‌ను కలిసిన ఎన్జీఓ నేతలు

కడప రూరల్: రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్‌ను ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ జిల్లా నేతలు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 పరిధిలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు చేపట్టిన సాధారణ బదిలీల కౌన్సెలింగ్ రీజనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా జరగడం అభినందనీయమని అన్నారు. ఆ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి రవికుమార్, తిమ్మారెడ్డి, నిత్యపూజయ్య పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, పొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల ప్రాంతాల్లో గుర్తింపు లేకుండా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు నడుస్తున్నాయన్నారు. పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజ్, సందీప్, గంగాదర్, బాబు, శ్రీనివాసులరెడ్డి, పీరోజ్‌ఖాన్, అలీ బాష, మన్సూర్‌అలీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ కళాశాలలు ప్రారంభమై పదిరోజులు గడిచినా ఇంతవరకు పిల్లలకు పాఠ్యపుస్తకాలను అందించలేదన్నారు. పిల్లలకు తాగడానికి మంచినీరు కూడా లేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవరెడ్డి, హరిబాబు, ప్రమోద్, గురు, మదు తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని మెడికేర్ హాస్పిటల్‌లో 25వ తేదీ ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని డాక్టర్ మహబూబ్ ఆలీ తెలిపారు. ఇందులో థైరాయిడ్, కొలెస్ట్రాల్, షుగర్, బీపీ లాంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. వైద్యంతోపాటు వారం రోజులపాటు మందులను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు.

అధిక పింఛన్ దరఖాస్తు గడువును పొడిగించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈపీఎఫ్ఓ అధిక పింఛన్ దరఖాస్తు గడువు ఈనెల 26తో ముగుస్తుందని, దానిని పొడిగించాలని ఏపీఎస్ ఆర్టీసీ యూనియన్‌నాయకులు సగినాల శ్రీనివాసులు, ఏఆర్ మూర్తిలు కోరారు. ఉద్యోగులు దరఖాస్తు చేయడానికి నాలుగు నెలల గడువు ఇస్తూ 2022 నవంబరులో సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. తర్వాత దీనిని ఈ ఏడాది మే 3వ తేదీ వరకు, ప్రస్తుతం దానిని ఈనెల 26వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఇంటర్నెట్ సరిగా పనిచేయనందున.. కొంతమంది ఆధార్‌కార్డులు ఈపీఎఫ్‌కు లింక్ కానందున హయ్యర్ పెన్షన్ దరఖాస్తులు అప్‌లోడ్ చేసేందుకు వీలు పడలేదని, అందువల్ల గడువును పొడిగించాలని కోరుతున్నారు.

మినీ రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద మినీ రిజర్వాయర్‌ను నిర్మించి కడప నగరానికి తాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నగర వాసుల దాహార్తిని తీర్చేందుకు దివంగత సీఎం వైఎస్సార్ సోమశిల రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి నీళ్లను అందించాలని పైపులైన్ నిర్మాణం చేపటట్టారన్నారు. ఆయన మరణానంతరం పనులు నిలిచిపోయాయన్నారు. ఇప్పుడు కడప నగరానికి చెందిన బ్రహ్మంసాగర్ నుంచి నీళ్లు తరలించేందుకు ఎక్కువ వ్యయం అవుతుందని, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ ఆయకట్టు రైతులు అన్ని విధాల నష్టపోతారని తెలిపారు. నగరంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ఆదినిమ్మాయపల్లె వద్ద మినీ రిజర్వాయర్‌ను నిర్మించి అక్కడ నీటిని నిల్వ చేసి తద్వారా కేసీ కెనాల్ ఆయకట్టు ద్వారా తాగు, సాగునీరు అందేలా చూడాలని కోరారు. ఏపీ రైతు సంఘం నాయకులు కొమ్మద్ది ఈశ్వరయ్య, రాధాకృష్ణ, రమణారెడి పాల్గొన్నారు.

గాంధీనగర్ మున్సిపల్ స్కూల్ తనిఖీ

కడప కార్పొరేషన్: కడప నగరం ఎర్రముక్కపల్లెలోని గాంధీనగర్ ఉన్నత పాఠశాలను మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరుపట్టికలను, లెసన్ క్యాలెండర్ బుక్స్‌ను పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నూతనంగా ఆవిష్కరించిన డిజిటల్ ఫ్లిప్ బోర్డు ద్వారా పిల్లలకు పాఠాలు బోధించాలన్నారు. ఆటపాటలకు కూడా తగిన సమయాన్ని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సత్యసుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆషాఢంలో అరచేతి వైభోగం!

కొనసాగుతున్న గోరింటాకు సంప్రదాయం



కడప కల్చరల్ : లేలేత అరచేతుల్లో ఎర్రగా పూసింది గోరింట. తమ చేతులను చూసుకుని యువతుల బుగ్గలు ఎర్రబడతాయి. మందారంలా, సింధూరంలా మనసును బంధిస్తాయి. కాళ్లు, చేతులే కాన్వాస్‌గా కళ్లు చెదిరే సహజమైన కళారూపాలవి..ఆషాఢ మాసంలో యువతులందరూ ఆశించే గోరింట సౌభాగ్యమది. తెలుగింటి సంప్రదాయ గౌరవాన్ని నిలిపే గోరింట అతివల అరచేతులలో మందార పూల పంట.గోరింటాకు పెట్టుకోవడమంటే ఆడవాళ్లందరికీ ఎంతో ఇష్టం . చిన్న పిల్లల నుంచి పండు ముదుసలి వరకు పెట్టుకుంటారు. ఎర్రగా మారిన తమ చేతులను చూసుకుని మురిసిపోతారు. 'గోరింట పూసింది కొమ్మ లేకుండా...మురిపాల అరచేత మొగ్గ తొడిగింది...'గోరింటాకుపైన ఓ సినీ కవి రాసిన పాట అది. పెట్టుకున్న గోరింటాకు మందారంలా ఎర్రబడితే మంచి మొగుడు వస్తాడని యువతులు, సింధూరంలా పూస్తే బతుకును పండిస్తాడని కొత్తగా పెళ్లయిన అమ్మాయిలు విశ్వసిస్తారు. ఆషాడమాసం కోసం ఎంతగానో ఎదురుచూస్తారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో గోరింటాకు చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. అమ్మాయిలు, స్త్రీలు దీన్ని సౌభాగ్యంగా భావిస్తుంటే ఇంకొందరు అలంకారంగా భావిస్తున్నారు.

జ్యేష్ఠమాసంలో వానలు మొదలై ఆషాఢం నాటికి వాతావరణం చల్లబడుతుంది. అతి వేడి నుంచి ఒక్కసారిగా చల్లగా మారడంతో శరీరం ఈ మార్పులకు తగినట్లుగా వెంటనే స్పందించకోతే వ్యాధుల బారిన పడాల్సి వస్తోంది. గోళ్లు పుచ్చిపోవడం, విరిగిపోవడాన్ని నివారించేందుకు ఈ సీజన్‌లో గోరింటాకు పెట్టుకుంటారు. శరీరంలోని వేడిని తగ్గించి ప్రస్తుత వాతావరణానికి అనుకూలంగా ఉండేందుకు చేతులు, కాళ్లతోపాటు హెన్నాగా గోరింటాకు తలకు కూడా వాడతారు.

కార్పొరేట్ స్థాయికి

మొన్నటివరకు గోరింటాకు ఉచితంగా దొరకుతున్నా శుభకార్యాలు మినహా మిగతా సమయాల్లో వాడేవారు కాదు. ఇటీవలి కాలంలో గోరింటాకు కార్పొరేట్‌స్థాయికి చేరింది. ముందుతరంలో కేవలం శుభ కార్యాల సమయంలో మాత్రమే వాడుతుండేవారు. ఇటీవలి కాలంలో ప్రతి చిన్న ఫంక్షన్లకు కూడా పోటీలుపడి గోరింటాకు అలంకరించుకోవడం ఫ్యాషన్‌గా మారింది. ఇటీవలి వివాహాలలో ప్రత్యేకించి ఒకరోజును సంగీత్ పేరిట 'మెహందీ'రోజుగా నిర్వహిస్తున్నారంటే దీని ప్రాధాన్యత అర్థమవుతుంది. మార్కెట్‌లో కేవలం కోన్‌లు, డబ్బాలలో గోరింటాకు పొడి, హెన్నా మాత్రమే లభించేది. ప్రస్తుతం బ్యూటీ పార్లర్‌లలో వందలాది డిజైన్లలో నచ్చిన వాటిని ఎంపిక చేసుకుని అరచేతుల నుంచి మోచేతుల వరకు కళ్లు చెదిరేలా కళాత్మకంగా గోరింటాకు పెట్టించుకుంటున్నారు. వీటి కోసం కొన్ని కంపెనీలు వివిధరకాల డిజైన్లను పుస్తకాలుగా విక్రయిస్తున్నారు. కేవలం గోరింటాకు పెట్టేందుకే బ్యూటీ పార్లర్‌లలో కొన్ని విభాగాలు ఉండడం విశేషం.ఓ పెళ్లికూతురికి గోరింటాకు అలంకరిస్తే రూ. 10 వేల నుంచి రూ. 50 వేలు తీసుకునే పార్లర్‌లు కూడా ఉన్నాయి. రాజస్థాన్, గుజరాత్ డిజైన్లకు మంచి ఆదరణ లభిస్తోంది. కేవలం మన దేశమేగాక ఇస్లామిక్ దేశాల్లో కూడా మహిళలు, యువతులు గోరింటాకును ఇష్టంగా పెట్టుకుంటారు. ఇటీవల ట్యాటు ఫ్యాషన్ గోరింటాకు స్థానాన్ని ఆక్రమించగా, తాత్కాలిక ట్యాటుగా గోరింటాకుతో డిజైన్లు వేస్తుండడంతో తిరిగి తన స్థానాన్ని నిలబెట్టుకుంటోంది. ముఖ్యంగా మన దేశంలోని హిందూ, ముస్లింల ఇళ్లలో ప్రతి చిన్న శుభ కార్యానికి గోరింటాకును అలంకరించుకోవడం తప్పనిసరిగా మారింది. కొన్ని ప్రముఖ మాల్స్, పెద్ద వస్త్ర దుకాణాలలో కొనేందుకు వచ్చే కస్టమర్లకు ఉచితంగా గోరింటాకు డిజైన్స్ పెట్టి ఏర్పాటు చేసి మహిళలు, యువతులను ఆకర్షిస్తున్నారు.

'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో కార్పొరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో విద్యార్థులకు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ, కుటుంబ సభ్యుల పత్రాలు ఎలాంటి రుసుము లేకుండానే ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఎవరైనా అర్హులుంటే రేషన్‌కార్డు, పింఛన్ వంటివి కూడా అందజేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 9 రోజుల్లోనే సర్టిఫికెట్లు ఇవ్వనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కార్పొరేటర్లు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు ఆర్. చెన్నయ్య, సుబ్బారెడ్డి, మగ్బూల్‌బాషా, పాకా సురేష్, బాలస్వామిరెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, మల్లికార్జున, డివిజన్ ఇన్‌చార్జులు బండి ప్రసాద్, శ్రీరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

తడిచెత్తను ఎరువుగా మార్చేందుకు చర్యలు

తడిచెత్తను ఎరువుగా మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్ చంద్ ఆదేశించారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన కంపోస్టుయార్డు, ఇండస్ట్రియల్ ఎస్టేట్, పుట్లంపల్లి జీటీఎస్ స్టోర్, పాత కంపోస్టు యార్డులను పరిశీలించారు. కంపాక్టర్ల ద్వారా కేవలం చెత్తను మాత్రమే కంపోస్టుయార్డుకు తరలించాలని, మట్టి, పూడికను లోడ్ చేయవద్దన్నారు. ఉక్కాయపల్లె కంపోస్టు యార్డు వద్ద సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. బయోమైనింగ్ మిషన్ ద్వారా గంటకు ఎన్ని టన్నుల చెత్తను సెగ్రిగేషన్ చేయవచ్చో పరిశీలించారు. పుట్లంపల్లి జీటీఎస్ స్టేషన్ పరిధిలో మైక్రో వర్మీ కంపోస్టు యార్డు ఏర్పాటు చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్లాప్ వాహనాల ద్వారా వచ్చే చెత్తను ఎప్పటికప్పుడు టిప్పర్ల ద్వారా కంపోస్టు యార్డుకు తరలించాలన్నారు. ఊటుకూరు వైఎస్సార్ సర్కిల్ సమీపంలో వే బ్రిడ్జ్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీందర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష... జగనన్న సురక్ష...

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



లబ్ధిదారునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కమలాపురం : దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఈ పథకం ప్రజలకు రక్ష అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం వార్డు-1 సచివాలయ పరిధిలోని క్రిష్ణానగర్, గిడ్డంగి వీధి, తెలుగు వీధి తదితర కాలనీల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రతి గడపలో ప్రజల నుంచి వస్తున్న సమస్యలను సావధానంగా విన్నారు. వాటిని పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా క్రిష్ణానగర్‌లో తాగునీటి సమస్య ఉందని, నీరు సరఫరా కాక పోవడంతో దూరం నుంచి నీరు తెచ్చుకుంటున్నామని నివాసితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో వారం రోజుల్లో పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని మునిసిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు ఆదేశించారు. ఈ ఈనెల రోజుల్లో అర్హులుగా ఉండి పథకాలు అందని వారు ఉండకూడదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, మహ్మద్ సాదిక్, హిదాయత్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, మస్తాన్, శంకర్‌రెడ్డి, కుమార్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, గంగాధర్‌రెడ్డి, మోనార్క్, జావీద్, దేవదానం, జెట్టి నగేష్, ఖాజాపీర్, అంబటి సురేష్, నిఖిల్‌రెడ్డి, హీరామియ్య, మర్రి సుబ్బన్న, చంద్రపాల్, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రూ. 25.70 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ
- ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అందుకే కోట్లాది రూపాయలతో గ్రామాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని రాచిన్నాయపల్లె వద్ద బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. మండల అభివృద్ధిలో భాగంగా రూ.25.70 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. ఈ పనులను కడప బైపాస్ రోడ్డు దేవునికడప ఆర్చి వద్దనుంచి వాటర్ గండి రోడ్డు ఓబులంపల్లి, ముండ్లపల్లి, రామనపల్లి, రాచినాయపల్లి మీదుగా పాత టోల్గేట్ వరకు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో రెండు బ్రిడ్జీలు ఉంటాయన్నారు. ఒకటి ముండ్లపల్లె వంక వద్ద, రెండవది రాచినాయపల్లి బుగ్గవంక మీద నిర్మించనున్నారు. దీంతో ఎనిమిది గ్రామాల ప్రజలకు రవాణా సౌలభ్యం చేకూరుతుందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాసీమబాబు, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్.భాస్కర్‌రెడ్డి, సర్పంచులు, సొంటం నారాయణరెడ్డి, అల్లాడు పాండురంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తుంగ చంద్రశేఖర్‌యాదవ్, చల్లా వెంకటసుబ్బారెడ్డి, పుత్తా వేణుగోపాల్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, బాబురెడ్డి, చంద్రఓబులరెడ్డి, శివారెడ్డి, కమలాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎస్టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్, కడప వక్కలపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రైమరీ స్కూల్ హెడ్ టీచర్ నజీబుల్లా కోరారు. పిల్లలను బడిలో చేర్పించాలని శుక్రవారం వక్కలపేటలో ఆయన అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులకు కరపత్రాలను అందచేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేట్ మోజులో పడి డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక వార్డు-1 సచివాలయం పరిధిలోని శనివారం జరిగే గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

మండలస్థాయి క్రీడా ఎంపికలు పూర్తి



క్రీడా ఎంపికలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వల్లూరు : కడప పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు గానూ వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండలస్థాయి ఎంపికలను నిర్వహించారు. ఎంపీడీవో జుబేద, ఎంఈవో లిల్లెమ్మ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎంపికలకు హాజరైన విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన నలుగురు విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 విజయరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'బ్రౌన్'ను సందర్శించిన పీసీసీ అధ్యక్షుడు

కడప కల్చరల్ : తెలుగునాట సుప్రసిద్ధమైన సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఇతర నేతలు, స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రౌండ్ ఫ్లోర్‌లోని గ్రంథాలయాన్ని, అందులోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం అందులోని తాళపత్ర విభాగాన్ని చూశారు. ఆంగ్లేయుడైన బ్రౌన్‌కు తెలుగుభాష పట్ల గల అభిమానానికి ఈ గ్రంథాలయం నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా వారు బ్రౌన్ గ్రంథాలయ ఆవరణలోగల బ్రౌన్ విగ్రహాన్ని, గ్రంథాలయ వ్యవస్థాపకులు జానమద్ది హనుమచ్ఛాస్త్రి తదితరుల విగ్రహాలను సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో వైవీయూ విద్యార్థులు



గురుకులం భవనాల వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం యూనిట్-1 ఆధ్వర్యంలో శుక్రవారం గురుకులం భవనాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సరిత మార్గదర్శనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వలంటీర్లు పరిసరాలను శుభ్రం చేశారు.

అకడమిక్ కన్సల్టెంట్‌ల పనితీరు మదింపు



అకడమిక్ కన్సల్టెంట్‌లతో మాట్లాడుతున్న వైవీయూ అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో అకడమిక్ కన్సల్టెంట్‌లుగా పనిచేస్తున్న అధ్యాపకుల పనితీరును వైవీయూ అధికారులు మదింపు చేశారు. వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఏజీ దాము, ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఆచార్య షావల్లీఖాన్, ఆచార్య చంద్రమతీశంకర్, ఆయా విభాగాల అధిపతుల ఆధ్వర్యంలో అకడమిక్ కన్సల్టెంట్‌ల బోధన సామర్థ్యాల పురోగతి, సబ్జెక్టుల్లో విషయపరిజ్ఞానం పరిశీలించారు. అధ్యాపకులుగా రాణించేందుకు అవసరమైన సూచనలు చేశారు. భవిష్యత్తులో విజ్ఞానవంతులైన అధ్యాపకులుగా తయారయ్యేందుకు అకడమిక్ ఆడిట్ ప్రక్రియను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. అంతకుముందు అకడమిక్ కన్సల్టెంట్ల అర్హతలు, పరిశోధన పత్రాలు, వర్క్‌షాపులు, సెమినార్లు, సింపోజియం, అకడమిక్ అభివృద్ధికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. జయంత్‌కశ్యప్, డా. ఎం. సుభోష్‌చంద్ర, డా. పి. సరిత, డా. వరప్రభాకర్, డా. సునీత తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులతో ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం కడపలోని శివానందపురం, నిరంజన్‌నగర్, ప్రకాశ్‌నగర్, ఎన్టీఆర్ నగర్, ఎస్టేట్‌లోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలందరూ సమయానికి హాజరయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారులందరికీ సక్రమంగా పోషకాహారం అందించాలన్నారు. రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. జులై 1 నుంచి టీహెచ్ఆర్ పంపిణీ ఉంటుందని, లబ్ధిదారులందరికీ అందేలా చూసుకోవాలన్నారు. కేంద్రాలలో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే సూపర్‌వైజర్, సీడీపీఓ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్ రేణుక, అంగన్వాడీ కార్యకర్తలు ఎలిజిబెత్ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కెనరా బ్యాంకు విజయవాడ సర్కిల్ ఆఫీసు జీఎం రవివర్మ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు విజయవాడ సర్కిల్ ఆఫీసు జనరల్ మేనేజర్ రవివర్మ తెలిపారు. శుక్రవారం కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం, కడప ఆధ్వర్యంలో రీటైల్ వ్యవసాయ సూక్ష్మ చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమల రుణాలకు సంబంధించిన విషయాలపై వ్యాపార వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీటైల్, వ్యవసాయ, పారిశ్రామిక, వ్యాపారాలకు సంబంధించి కెనరా బ్యాంకు వివిధ రకాల రుణాలను అందిస్తోందన్నారు.కెనరాబ్యాంకు ప్రాంతీయ కార్యాలయం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మురళీమోహన్ మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలో ఉన్న వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించడంలో బ్యాంకు ముందుంటుందన్నారు.అనంతరం ఎంపికైన వారికి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐబీసీ చీఫ్ అడ్వయిజర్, కెనరా బ్యాంకు డివిజనల్ మేనేజర్ రాజశేఖర్, డీఎంఎం అయ్యుబ్, డీఎంఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో శ్రీనివాసులురెడ్డి అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

వల్లూరు : కడప పట్టణంలో హత్యకు గురైన శ్రీనివాసులురెడ్డి మృతదేహం శుక్రవారం సాయంత్రం అతని స్వగ్రామమైన వల్లూరు మండలంలోని చిన్న నాగిరెడ్డిపల్లెకు చేరింది. బంధువులు, గ్రామస్తులు, స్నేహితుల మధ్య అంత్యక్రియలను నిర్వహించారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి శ్రీనివాసులురెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్ఆర్‌సీపీ వల్లూరు మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీటీసీ గంగయ్య, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఓవీ సుబ్బారెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, విజయ హోటల్స్ అధినేత మాధవరెడ్డి, మాచిరెడ్డిపల్లె శంకర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధనవృద్ధి పాలసీ విడుదల



నూతన పాలసీ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌డీఎం గిరిధర్, ఇతర అధికారులు

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థ కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ శుక్రవారం ధనవృద్ధి నూతన పాలసీని ఆవిష్కరించారు. డివిజనల్ కార్యాలయంలో ఈ మేరకు ఆయన ధనవృద్ధి పాలసీ వివరాలుగల బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా రక్షణతో కూడిన ఫిక్స్‌డ్ డిపాజిట్ పాలసీగా ధనవృద్ధిని ఆవిష్కరించామన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 60 ఏళ్ల వయస్సున్న వారి వరకు ఎవరైనా ఈ పాలసీ తీసుకోవచ్చన్నారు. అత్యధిక వడ్డీరేటును అందించే ఈ పాలసీ సెప్టెంబరు 30వ తేది వరకు లభ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామసుందర్‌రావు, సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, ఇతర మేనేజర్లు యల్లారెడ్డి, సత్య శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, గురురాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళాలను నిర్వహిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి అందెల సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ సంస్థల ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు జరుపుతున్నట్లు చెప్పారు.ఏ సంస్థలోనైనా కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఐటీఐ మైనార్టీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఐటీఐ తర్వాత ఎలాంటి కోర్సులు చదవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్, జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ డోనప్ప తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్‌వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్(ఆర్‌వైఎఫ్) రాష్ట్ర కన్వీనర్ కళ్యాణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలో ఆర్‌వైఎఫ్ రాష్ట్ర కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జులై 22,23 తేదీల్లో కడప నగరంలో జరిగే మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు,గ్రూపు-1, గ్రూపు-2 పోస్టులను పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, ప్రసాద్, సురేష్, అయ్యన్న, సుబ్బరాయుడు, గోపీ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా రవాణాధికారికి వినతిపత్రాన్ని ఇస్తున్న తల్లిదండ్రులు

బస్సు పాసులు ఇవ్వాలని వినతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర శివార్లలోని కేంద్రీయ విద్యాలయ కేంద్రానికి(కేవీకే) రాకపోకలు సాగించేందుకు పూర్తి స్థాయిలో బస్సు పాసులు ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు జితేంద్ర, రాజులు కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి కేంద్రీయ విద్యాలయం పునః ప్రారంభించారని, ఇంతవరకు ఒక్క బస్సు పాసు కూడా ఇవ్వలేదన్నారు. ఆరు బస్సులు తిప్పాల్సి ఉండగా, ప్రస్తుతం మూడింటిని మాత్రమే తిప్పుతున్నారని, ఈ కారణంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ బస్సు పాసులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తూ అనేక కార్యక్రమంలో కేవీకే తల్లిదండ్రులు నరసింహులు, చినబాబు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.